క్లుప్తంగా

టైలరింగ్‌లో సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పూర్తి చేసిన మహిళలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు బీఆర్ఆర్ నగర్‌లో 70 మంది మహిళలకు రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తికావడంతో సోమవారం స్థానిక గ్రామ సంఘం కార్యాలయంలో ఆ మహిళలకు రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ ప్రతినిధులు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ ఆర్.రామకృష్ణారావు మాట్లాడుతూ మహిళలు ఇక్కడ పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిర్వాహకురాలు కృష్ణవేణి, క్లబ్ సెక్రటరీ ఎస్.ఎస్.ఎన్.రాజు, అసిస్టెంట్ గవర్నర్ డి.వి.వి.వర్మ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



ఏఐటీయూసీ జెండాన్ని ఆవిష్కరిస్తున్న పడాల గోవింద్

మద్దిలపాలెం : ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని మద్దిలపాలెంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలతో నిత్యావసర ధరలను తగ్గించాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. వీటిని రద్దు చేసే వరకు కార్మికులు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సమితి సభ్యులు ఎస్.మధు రెడ్డి, రామ్మోహన్, లోవరాజు, నంద, నాగు, వైఆర్‌కె రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెదల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార: మనస్తాపంతో ఓ వ్యక్తి చెదల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం మాదేటి గార్డెన్స్‌లో గుప్తా (48), పవనొట్టి సావిత్రి దంపతులు నివసిస్తున్నారు. రెండేళ్లుగా నోటి క్యాన్సర్‌తో అతడు బాధపడుతున్నాడు. ఎంవీపీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్న గుప్తా సోమవారం ఇంట్లో ఉన్న చెదల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న భర్త నోటి నుంచి రక్తం రావడాన్ని భార్య గమనించి వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుప్తా మృతిచెందాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచిలో కూడా ఆన్‌లైన్ పేమెంట్ చేయవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

వంతెనలకు మహర్దశ

- ఆరిలోవలో గెడ్డలపై ఇరుకు బ్రిడ్జిల విస్తరణకు శ్రీకారం
- చురుగ్గా సాగుతున్న నిర్మాణ పనులు



పార్వతీనగర్, సూర్యతేజనగర్ మధ్య జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం

ఆరిలోవ: రహదారులు విశాలంగా ఉన్నా మధ్యలో ఉన్న వంతెనలు ఇరుకుమయంగా ఉంటే ఫలితం శూన్యం. వాహనచోదకులకు ట్రాఫిక్ సమస్య తప్పదు. ఆరిలోవ ప్రాంతంలో చాలా వరకు రహదారులు విస్తరణకు నోచుకున్నాయి. అయితే మధ్యలో పలు చోట్ల గెడ్డలపై బ్రిడ్జిలు ఇరుకుగా ఉన్నాయి. దీంతో బ్రిడ్జిల వద్ద వాహనాల రాకపోకలు కష్టతరమవుతోంది. ఈ నేపథ్యంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వంతెనల విస్తరణపై దృష్టి సారించారు. దశాబ్దాలుగా ఇరుకుగా ఉన్న బ్రిడ్జిలు ఇప్పుడు విస్తరణకు నోచుకున్నాయి. జీవీఎంసీ అధికారులు ఆరిలోవ ప్రాంతంలో అవసరమైన చోట్ల గెడ్డలపై బ్రిడ్జి నిర్మాణాలు చురుగ్గా చేపడుతున్నారు. జీవీఎంసీ 11, 12 వార్డుల మధ్యలో ఉన్న పార్వతీనగర్, సూర్యతేజనగర్ మధ్య బ్రిడ్జి నిర్మాణంతో పాటు 13వ వార్డు రామకృష్ణాపురంలో గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు.

సూర్యతేజానగర్ బ్రిడ్జి

చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద బీఆర్‌టీఎస్ కూడలి నుంచి సూర్యతేజానగర్ వద్ద శ్రీకాంత్‌నగర్ మలుపును కలుపుతూ రోడ్డు విస్తరణ పనులు ఇటీవల పూర్తి చేశారు. ఈ రోడ్డును 60 అడుగుల నుంచి 80 అడుగులకు విస్తరించారు. ఈ మార్గం మధ్యలో సూర్యతేజానగర్ వద్ద పెద్ద గెడ్డ ఉంది. దీనిపై సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన చిన్న వంతెనపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఇక్కడ ఈ బ్రిడ్జిని పూర్తిగా తొలగించేశారు. దాన్ని విస్తరించి సుమారు 40 అడుగుల వెడల్పుతో కొత్తగా వంతెన నిర్మాణం చేపట్టారు. రెండు నెలలుగా ఈ పనులు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో పనులు పూర్తి కానున్నాయి. ఈ నిర్మాణం కోసం సుమారు రూ.3 కోట్లు నిధులు కేటాయించారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, టీఐసీ పాయింట్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల నుంచి వాహనచోదకులు చినగదిలి వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డుకు సులువుగా చేరుకోవచ్చు.

రామకృష్ణాపురంలో ముంపు సమస్యకు మోక్షం



రామకృష్ణాపురంలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం

జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో రెండేళ్ల క్రితం విశాలమైన సీసీ రోడ్డు నిర్మించారు. ఈ గ్రామం మధ్య నుంచి గెడ్డ ముడసర్లోవ రిజర్వాయరు వరకు ఉంది. వర్షాకాలంలో పైనుంచి వచ్చిన వరద నీరు ఈ గెడ్డ ద్వారా ముడసర్లోవ రిజర్వాయరులోకి చేరుతుంది. గ్రామంలో రోడ్డు మధ్యలో ఉన్న ఈ గెడ్డపై గతంలో కల్వర్టు నిర్మించారు. వరద నీరు పోవడానికి దీని కిందన సిమెంట్ కుండీలు ఏర్పాటు చేసి పైన శ్లాబు వేశారు. ఈ కల్వర్టు కిందన అమర్చిన కుండీలు నుంచి ఎక్కువ నీరు కిందకు వెళ్లకపోవడంతో గ్రామంలోకి నీరు పోటెత్తుతోంది. ఈ సమస్య మేయర్ హరి వెంకటకుమారి దృష్టికి కార్పొరేటర్ కెల్ల సునీత తీసుకెళ్లడంతో బ్రిడ్జి నిర్మాణం సాకారమైంది. రూ.33.50 లక్షల నిధులతో నెల రోజులుగా జీవీఎంసీ అధికారులు ఇక్కడ బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు వర్షాకాలంలో ముంపు సమస్య తప్పుతుంది.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం



ఆరిలోవ ప్రాంతంలో ఇరుకు బ్రిడ్జిల సమస్య దశాబ్దాలుగా ఉంది. ప్రధానమైన సమస్యగా నిలిచిన పార్వతీనగర్, సూర్యతేజనగర్ బ్రిడ్జి పనులు సుమారు రూ.3 కోట్ల నిధులతో చేపట్టాం. ఈ పనులు మరో నెలలో పూర్తవుతాయి. రామకృష్ణాపురంలో వరద నీరు నిలిచిపోకుండా చేపట్టిన చర్యల్లో భాగంగా గ్రామం మధ్యలో గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం రూ. 33.50 లక్షలతో చేపడుతున్నాం. ఆయా బ్రిడ్జిల నిర్మాణం త్వరగా పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారును ఆదేశించాం.

– గొలగాని హరి వెంకటకుమారి, నగర మేయర్

‘ఆరోగ్య సురక్ష’తో పేదలకు మెరుగైన వైద్యం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య అన్నారు. పాత వెంకోజీపాలెంలోని అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో లక్ష్మీనర్సింహనగర్ సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల చెంతకే స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి పరీక్షలు చేయడం వంటి గొప్ప కార్యక్రమం దేశంలో మరే రాష్ట్రంలో చేపట్ట లేదన్నారు. ఈ శిబిరంలో సుమారు 450 మందికి వైద్య పరీక్షలు చేశారు. పాత వెంకోజీపాలెం ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బందితో పాటు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పీలా వెంకట్, ఏసురత్నం, సత్తిబాబు, త్రినాథరావు, రాజారావు, అచ్యుత, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘ఏపీకి జగనే ఎందుకు కావాలి’ విజయవంతమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం: ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ‘ఏపీకి జగనే ఎందుకు కావాలి’ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి అధ్యక్షతన సోమవారం ప్రియదర్శిని కాలనీలో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డినే ఎందుకు ఎన్నుకోవాలనేది ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దకే అందిస్తున్న పథకాలు, సేవల గురించి విపులంగా వివరించాలన్నారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నవంబర్ 9వ తేదీ నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గృహ సారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు అంకిత దీక్షతో ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో..

టీచర్స్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీతల గోవింద్ అధ్యక్షతన శివాజీపాలెంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ఎంపీ ఎంవీవీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరించాలన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న ఆసరా వంటి సంక్షేమ పథకాల విశిష్టతను ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బాబిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ఆళ్ల శివగణేష్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదనం ఉట్టిపడేలా..



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నాక్ కమిటీ సందర్శన నేపథ్యంలో వివిధ విభాగాలు కొత్తకళను సంతరించుకుంటున్నాయి. ఈ క్రమంలో తెలుగు విభాగం స్నాతకోత్సవ విద్యార్థులు ఆ విభాగ ఆవరణలో వివిధ రంగవల్లులు అద్ది తెలుగుదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా తెలుగు తోటలోని పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రత చేశారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతి వారసత్వాన్ని సమాజానికందించే శక్తిగా మారుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బూసి వెంకటస్వామి, కె.రత్నశేఖర్, పి.లావణ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుకు సాహితీ విఖ్యాత పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జీవీఎంసీ స్కూల్ ఉపాధ్యాయుడు ధర్మారావు

సీతంపేట: అర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ ఇటీవల ఇంటర్‌నెట్ వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి రికార్డ్ కవితల పోటీలో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో పనిచేస్తున్న గ్రేడ్ 1 తెలుగు ఉపాధ్యాయుడు ఎం.వి.ధర్మారావుకు సాహితీ విఖ్యాత అంతర్జాతీయ పురస్కారం వరించింది. కరీంనగర్ పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం, సన్మానం అందుకున్నారు. ఒక్క గంట వ్యవధిలో నాలుగు కవితలు రాసినందుకు తన సాహితీ ప్రతిభను గుర్తించి పురస్కారం ప్రదానం చేశారని ఆయన తెలిపారు. కవి, విశ్లేషకులు భవానీ సాహితీ కళావేదిక అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా స్వర్ణ కంకణం గౌరవాన్ని పొందారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

- ఒకరికి 5 రోజుల జైలు

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 2వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు 22 మందికి జరిమానాలు, ఒక వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించింది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం ప్రాంతాల్లో గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 23 మందిపై కేసులు ఇటీవల నమోదు చేశారు. వారిని సెక్షన్ 180, 181, 185, ఎంవీ ఎక్ట్ ప్రకారం రూ.2,000 నుంచి రూ.8,000 వరకు జరిమానాలు విధించారు. కొత్తపాలేనికి చెందిన గంట్యాడ నాగభూషణానికి 5 రోజుల జైలు శిక్ష, రూ.50 జరిమానా వేశారు.

రౌడీషీటర్లపై పూర్తి నిఘా

- సీపీ రవిశంకర్



ఏసీపీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

గోపాలపట్నం: రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉంచాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశించారు. వెస్ట్ ఏసీపీ కార్యాలయంతో పాటు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో నమోదవుతున్న పలు కేసులు గురించి ఆరా తీశారు. మహిళలపై ఎటువంటి దాడులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశ యాప్‌పై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కింద నమోదైన కేసులతో పాటు పలు మార్లు అరెస్ట్ అయిన పెడ్లర్లపై పీడీ యాక్టు నమోదు చేసే చర్యలపై చర్చించారు. డివిజన్ పరిధిలోని స్టేషన్ల పని తీరుపై ఏసీపీ అన్నెపునరసింహ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని పని తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి విచారించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీసీపీ-2 ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రెడ్ క్రాస్ ఆపన్నహస్తం



రైలు ప్రమాద బాధితులకు సహాయం చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

మహారాణిపేట: విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైళ్ల ప్రమాదంలో క్షతగాత్రులకు రెడ్ క్రాస్ ఆపన్నహస్తం అందించింది. రెడ్ క్రాస్ విశాఖపట్నం చైర్మన్ యు.నాగేంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ వలంటీర్లు ఆదివారం రాత్రి నుంచి రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గాయపడినవారికి ఫస్ట్ ఎయిడ్ చికిత్సలు అందించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడంలో సహకారం అందించారు. జిల్లా కోఆర్డినేటర్లు సంతోష్, గౌరీ ప్రసాద్, ఇతర వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



16వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి, తదితరులు



19వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి వారు అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఉన్న గెడ్డ సైడ్ వాల్ నిర్మాణం, రోడ్డు నిర్మాణానికి ఈ భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈ లక్ష్మి, పార్టీ నాయకుడు పల్లా త్రినాథ్, రజకవీధి ప్రెసిడెంట్ అప్పారావు, రమేష్, మీసాల ప్రదీప్, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 18, 19 వార్డుల్లో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18, 19 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. సోమవారం ఆయా ప్రాంతాల స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పనులు ప్రారంభించారు. 18 వార్డులో రూ.75 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మౌలిక వసతులు, అభివృద్ధి పనులను వేగంగా చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు, పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, పేర్ల విజయచందర్, పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 19వ వార్డు శివగణేష్ నగర్, జాలరి ఎండాడలో రూ.47 లక్షలతో తలపెట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ఎంపీ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నూకరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు సూరాడ వెంకటలక్ష్మి, వి.గణేష్, ముచ్వల సురేష్, ఉమ్మిడి దాసు, సూరాడ దాసు, పరదేశి పాల్గొన్నారు.

ఆటోలో మేయర్.. సైకిల్‌పై కమిషనర్

- సొంత వాహనాలు వదిలి కార్యాలయానికి పయనం
- కాలుష్య నియంత్రణకు సహకరించాలని విన్నపం



ఆటోలో జీవీఎంసీకి చేరుకున్న మేయర్



తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. మేయర్ హరివెంకట కుమారి సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

సరికొత్త ట్రయంఫ్ స్క్రాంబ్లర్ ఆవిష్కరణ



తొలివాహనాన్ని కొనుగోలుదారుకు అందజేస్తున్న వరుణ్‌బజాజ్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: రైడర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400 ఎక్స్ సోమవారం విశాఖ మార్కెట్లోకి విడుదలైంది. ఇసుకతోటలోని ట్రయంఫ్ వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రోబైకింగ్ సర్కిల్ హెడ్ గౌతమ్ మోడి, వరుణ్ బజాజ్ సీఈవో శ్రీనివాస్‌లు ఈ వాహనాన్ని విడుదల చేశారు. తొలివాహనాన్ని కొనుగోలుదారుడికి అందజేశారు. ఔత్సాహిక రైడర్లకు ఈ బైక్ మంచి ఎంపికన్నారు. టీఆర్– సిరీస్ ఇంజిన్, 6 స్పీడ్ గేర్‌బాక్స్, 835 ఎంఎం సీట్ హైట్, 195 ఎంఎం గ్రౌండ్‌క్లియరెన్స్, ఎల్ఈడీ డిస్‌ప్లే, 320 ఎంఎం డిస్క్, ఏబీఎస్‌తో కూడిన పవర్‌ఫుల్ రేడియల్ కాలివర్ వంటి అత్యద్భుత ఫీచర్ ఈ బైక్‌లో ఉన్నట్లు షోరూం ప్రతినిధులు తెలిపారు. రూ.2,62,996 లక్షల ఎక్స్‌షోరూం ధరకు ఈ బైక్ లభిస్తుందన్నారు.

జీఎస్‌టీ అధికారుల తనిఖీలు



ఉప్పల మంగరాజు గిడ్డంగిలో తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అధికారులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతబయలు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఉప్పల మంగరాజుకు చెందిన వ్యాపార సంస్థలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన సోదరుడు ఉప్పల రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు వీరు వచ్చినట్టు తెలిసింది. సంతబయలు ప్రాంతంలో ఉప్పల చిన వెంకటరమణకు 15వ నంబరు రేషన్ డిపో ఉంది. ఈ డిపో ఉన్న షాపు తనదని కొంతకాలంగా తండ్రి చిన వెంకటరమణ, తమ్ముడు మంగరాజుతో రమేష్‌బాబు న్యాయపోరాటం చేస్తున్నాడు. దీనిపై పలుమార్లు పౌరసరఫరాల శాఖ అధికారులు, భీమిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నాడు. ఇటీవల తన తమ్ముడు అగ్గిపెట్టెల వ్యాపారంతోపాటు అక్రమంగా గుట్కా వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపిస్తూ సెంట్రల్, స్టేట్ జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఈ నెల 18న సెంట్రల్ జీఎస్టీ అధికారులు, సోమవారం స్టేట్ జీఎస్టీ అధికారులు మంగరాజు గిడ్డంగిని పరిశీలించి అగ్గిపెట్టెలు మాత్రమే ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. తనిఖీలకు సంబంధించి జీఎస్టీ అధికారులు ఎలాంటి సెర్చ్ వారెంట్లు తనకు చూపలేదని మంగరాజు తెలిపారు. దీనిపై మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.

‘విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు’

ఎంవీపీ కాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర ఖండించారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు కారణంగా జరుగుతున్న నష్టాన్ని పురందేశ్వరి వివరించారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా సంపూర్ణ మద్య నిషేధంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనిపై విజయసాయిరెడ్డి వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.